

వివరాలు మెయిన్‌లో

**తెలంగాణలో అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేయాలి**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 15 అక్టోబరు , 2026 | పేజీలు : 4


## 'సర్' ప్రక్రియపై 16,17 తేదీల్లో
# ప్రత్యేక క్యాంపులు
### కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఈనెల16,17 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన కలెక్టరేట్ నుండి ఆర్‌డిఓ లు, తహసీల్దార్లతో ఎస్ఐఆర్ ప్రక్రియ, తాగునీటి సరఫరా,భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించి,అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారు ఓటరుగా నమోదయ్యారా లేదా పరిశీలించి, కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఫామ్6లో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.బీఎల్‌వోలు,ఎల్‌ఓలు సమన్వయంతో పని చేస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్యాంపుల వివరాలు తెలియజేయాలని సూచించారు.క్యాంపుల నిర్వహణకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలన్నారు.భూభారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని,రీ సర్వే ప్రక్రియను కూడా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఆర్‌ఓలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




**ఫామ్-18 ద్వారా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు పెంచాలి**

వరంగల్‌ఖమ్మంనల్లగొండ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు సంబంధించి ఫామ్18 ద్వారా ఓటరు నమోదును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి గ్రాడ్యుయేట్ ఎన్నికల పరిధిలోని జిల్లాల డీఆర్‌ఓలు, ఆర్‌డిఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.ఉపాధ్యాయులు,డిగ్రీ కళాశాలల విద్యార్థులు,అర్హులైన గ్రాడ్యుయేట్లలో అవగాహన కల్పించి ఓటరు నమోదును పెంచాలన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారాలను డౌన్‌లోడ్ చేసి పోలింగ్ స్టేషన్ వారీగా క్రమబద్ధీకరించాలని, ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నందున అవసరమైన జంబో బ్యాలెట్ బాక్సులను ముందుగానే గుర్తించి ఏర్పాట్లు చేసుకోవాలని పోలింగ్ స్టేషన్ల నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి హాజరయ్యారు.



## ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులతో పాటు హాస్టల్ వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం,రాయడం,సంఖ్యాపరమైన అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకు జిల్లాలో తక్కువ పురోగతి ఉన్న 100 పాఠశాలలను గుర్తించి,నెల రోజుల్లో ఆ పాఠశాలల్లో కనీసం 70 శాతం లక్ష్యాలు సాధించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో పాటు,హోంవర్క్ ఇచ్చినప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని,అప్పటికీ విద్యార్థిలో పురోగతి రాకుంటే మరో పద్ధతిలో పాఠాలు బోధించాలన్నారు.2 నుండి 5,5 నుండి 9 తరగతులు చదివే విద్యార్థులకు దసరా పండుగ తర్వాత నవంబర్ 1లోగా ఈ 70 శాతం లక్ష్యాలు సాధించేలా దృష్టి సారించాలన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి ద్వారా దరఖాస్తులు చేయించాలని,తహసీల్దార్ ద్వారా తక్షణమే ఆధార్ కార్డులు ఇచ్చేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి,స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు,ఎంఈఓలు,ఆర్‌పిఓలు,పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు హాజరయ్యారు.

## దోసపహాడ్ శివారులో ఇసుక డంప్ సీజ్

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండలంలోని దోసపహాడ్ గ్రామ శివారులో అనుమతులు లేకుండా నిల్వ ఉంచినట్లుగా భావిస్తున్న ఇసుక నిల్వలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని సింగం వీరలింగం అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో సుమారు 4 టిప్పర్ల ఇసుక లోడ్ నిల్వ ఉంచినట్లు అధికారులకు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. ఈ మేరకు రెవెన్యూ ఆర్ఐ రంజిత్ రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి సదరు స్థలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఇసుక నిల్వలకు సంబంధించి స్థల నిర్వాహకుల వద్ద ఎలాంటి అధికారిక అనుమతి పత్రాలు లభ్యం కాలేదని తెలిపారు. పంచనామా నిర్వహించి చట్టపరమైన చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో ఆర్ఐతోపాటు పిసి జోసెఫ్, రవి కుమార్‌లు పాల్గొన్నారు.




## ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం
# అందించడమే లక్ష్యం
### అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. గత రెండు రోజులుగా జాతీయ రహదారి 65 పై గల హోటళ్ళు, రెస్టారెంట్లు, దాబాలలో ప్రత్యేక తనిఖీలను విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మొత్తం 10 ప్రత్యేక బృందాలతో డ్రైవ్‌ను నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించగా మూడింటిపై తీవ్ర ఉల్లంఘనల కింద లైసెన్స్ సస్పెండ్ చేసినట్లు, మరో మూడు కేంద్రాల్లో పరిశుభ్రత లోపాలపై సాధారణ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. తనిఖీల సందర్భంగా ఆయా కేంద్రాల్లో వంటకాలపై పురుగుల ఉనికి, బొద్దింకలు ఉండడం, అపరిశుభ్రమైన రిఫ్రిజిరేటర్లు, ఫంగస్ పట్టిన కూరగాయలు, ఎలుకల విసర్జనలతో కలుషితమైన పదార్థాలు కొనుగొన్నట్లు తెలిపారు. శాకాహార మాంసాహార పదార్థాలను కలిపి నిల్వ చేయడం, ఐస్ ముక్కలను పచ్చి మాంసంతో ఉంచడం, జిడ్డు పట్టిన ఎగ్జాస్ట్‌లు, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలు వేయడం వంటి లోపాలు ఉన్నట్లు చెప్పారు.



కొన్ని సంస్థల్లో అనుమతించబడని సింథటిక్ ఆహార రంగులు, లేబులింగ్ లోపాలు, సిబ్బంది వైద్య ధృవపత్రాలు, పురుగుల నియంత్రణ రికార్డులు లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. నిర్వాహకులు తప్పనిసరిగా ఆహార పరిరక్షణ లైసెన్స్‌లను ప్రదర్శించాలని, వంటగదులు, నిల్వ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై తయారీ తేది, వినియోగ గడువు వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కలెక్టరేట్ ఎదుట నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ధర్నాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డితో పాటు ఐఎన్‌టీయూసీ నాయకుడు బైరబోయిన బిక్షం, సీఐటీయూ నాయకుడు సలీంలు వేరువేరుగా సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉద్యోగాల క్రమబద్ధీకరణకు నోచుకోకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయమని విమర్శించారు.ఏజెన్సీల ద్వారా వేతనాలు చెల్లిస్తుండటంతో కొన్ని సందర్భాల్లో నాలుగైదు నెలల పాటు వేతనాలు ఆలస్యమవుతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. చేసిన పనికి సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు, వైద్య ఖర్చులకు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, ప్రతి నెలా నిర్ణీత తేదీన వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## నిరుపయోగంగా ఉన్న గుండాల బస్టాండ్‌పై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ప్రజల సౌకర్యార్ధం దృష్టిలో ఉంచుకొని తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం యాదగిరిగుట్ట ఆర్టిసి డిపో సిఐని కలిసి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ప్రజల అవసరాల నిమిత్తం అందుబాటులోకి తీసుకు వచ్చి, బస్సుల రాకపోకలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గుండాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్‌రెడ్డి, రామారం ఉప సర్పంచ్ నవీన్, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలిగా సునీత

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలిగా పాలడుగు సునిత బుధవారం ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా చంద్రగిరి మంజుల, ఉపాధ్యక్షురాలుగా మంజుల, సహాయ కార్యదర్శిగా దానమ్మ, కోశాధికారిగా రేణుకలను గ్రామ సంఘ బంధాల లీడర్లు, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షురాలు సునిత మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, సంఘాలకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామ సర్పంచ్ పంగ జయసుద సతీష్‌రెడ్డి, సంఘం లీడర్లు పాల్గొన్నారు.

## నీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/చివ్వెంల :** రైతులు వేసిన పంట పొట్ట దశకు చేరుకున్నందున పొలంలో నీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం హుజూర్‌నగర్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. బుధవారం మండలంలోని పాండ్యానాయక్ తండలో వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత సాగు పరిస్థితులు, వరి పంట ఎదుగుదల, నీటి లభ్యత, చీడపీడల ఉనికి తదితర అంశాలను పరిశీలించి, పంటల నిర్వహణపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె. పరిమళ, కె. సంధ్యారాణి, హుజూర్‌నగర్ కోఆర్డినేటర్ కె. చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి డి. వెంకటేశ్వర్లు, విస్తరణ అధికారులు బి. శైలజ, డి. మానస, రైతులు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కార్యాచరణ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** 2029లో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకరావడమే యూత్ కాంగ్రెస్ పనిచేస్తుందని నియోజకవర్గ యూత్ అధ్యక్షులు కుక్కడపు మహేష్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నూతన కమిటిల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కుక్కడపు మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గరిడేపల్లి మండల యూత్ కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో నూతన క మిటిని ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యచరణపై చర్చించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి ప్రధాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మరోసారి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు నిర్ణయించినట్లు తెలిపారు. గరిడేపల్లి మండల యూత్ అధ్యక్షులుగా నకిరేకంటి సతీష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల వినయ్, కోటేష్, గోపి, జగన్, వినోద్, మోహన్, రంగా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మిర్యాలగూడ టూ టౌన్ ఎస్ఐ సతీష్‌కు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ టూ టౌన్ ఎస్ఐ సతీష్ తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం ఆయన విధులకు హాజరయ్యేందుకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ తన సొంత గ్రామమైన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం నుంచి మిర్యాలగూడకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో నేరేడుచర్ల సమీపంలోకి రాగానే ఆయన నడుపుతున్న బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి కింద పడిపోవడంతో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, తోటి ప్రయాణికులు వెంటనే స్పందించి సమాచారం అందించడంతో 108 అత్యవసర వాహనంలో ఆయనను మిర్యాలగూడ పట్టణానికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు సతీష్‌కు ప్రాథమిక చికిత్స అందించి ప్రాథమిక వైద్య సేవలు నిర్వహించారు.



అయితే గాయాల తీవ్రత అధికంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆయనను అత్యవసర వాహనంలో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విధి నిర్వహణకు వస్తూ ప్రమాదానికి గురికావడంతో తోటి పోలీస్ సిబ్బంది, ఆత్మీయులు ఆందోళన చెందుతూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జాతీయ మహాసభల జయప్రదానికి అందరూ సహకరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటిగడ్డ అయిన నల్లగొండ జిల్లాలో నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత 36వ రైతు మహాసభలను విజయవంతం చేయడానికి కార్మికులు, కర్షకులు, ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ మహాసభల జయప్రదం కొరకు ప్రచార కమిటీతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టి ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ రైతాంగ ఉద్యమ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైన ఘనమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. నల్లగొండ గడ్డ అనేక వీరోచిత రైతాంగ పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందని, అదే పోరాట స్ఫూర్తితో ప్రస్తుత కాలంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవినాయక్, సీపీఎం నాయకులు జిల్లోజు శీను, వంగ అశోక్, సోమయ్య, సైదులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఇసి తక్షణమే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఎన్నికల ప్రధాన కమీషనర్ (సిఈసి) జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్‌సర్) ప్రక్రియను నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సిపిఎం అఖిల భారత నాయకులతో పాటు తెలంగాణకు చెందిన పలువురు నాయకులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని నల్లాల బావి సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తున్న నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, వెల్పుల వెంకన్న, జె. నరసింహారావు పాల్గొన్నారు.






## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. నల్లగొండ నగరపాలక సంస్థ, ఎస్‌సి,ఎస్‌టి,బీసీ వెల్ఫేర్ శాఖ,మత్స్య శాఖ,జిల్లా పౌరసరఫరాల శాఖ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంబరాలను నగరపాలక సంస్థ మేయర్ బుర్రి చైతన్యశ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సంృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని, కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలు పలువురిని ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వంశీకృష్ణ,మత్స్యశాఖ సూపరింటెండెంట్ ప్రసాద్,రవి నాయక్,ప్రియాంక,డైరెక్టర్ లక్ష్మి,పౌరసరఫరాల శాఖ డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చర్చి ప్రహరీ గోడను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని కేసారం గ్రామంలోని బెతెస్థ ప్రార్థన మందిరంలోనికి అక్రమంగా మరణాయుధాలతో ప్రవేశించి చర్చి ప్రహరీ గోడను కూల్చిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సూర్యాపేట నియోజక వర్గ పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రార్థన మందిరాలపై దాడులు చేయడం ముర్కత్వమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో బిషప్ ముల్లంగి జాకబ్ రాజు, పాస్టర్ యల్కా ప్రభాకర్, ఏర్పుల క్రిస్టోఫర్, రెవ. పంది మార్క్, యం. రూబెన్, బాణాల సైమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాబోయే ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ తప్పని సరిగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని హుజూర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, విద్యావంతులు చట్టసభల్లో సరైన భాగస్వామ్యం వహించాలంటే ఓటు నమోదు ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉండి, నిబంధనల ప్రకారం అర్హత పొందిన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు.

## మహాచండీదేవిగా భక్తులకు దర్శనం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ చండీమాతకు ప్రత్యేక పూజలు చేసి, భవాని దీక్ష ధారణ భక్తులకు పూజలతో పాటు చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి సభ్యులు బ్రాహ్మణపల్లి మురళీధర్, పబ్బ ప్రకాశరావు, కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్‌రావు, బెలిదే అశోక్, గోపారపు రాజు, భక్తులు పాల్గొన్నారు.



## కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మెదక్ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను రాష్ట్ర రజక సంఘం నాయకులు వెంకటంపేట బాలయ్య తీవ్రంగా ఖండించారు.బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు.అలాంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని, ఇది ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆశయాలను గౌరవిస్తూ మహనీయుల విగ్రహాలకు తగిన రక్షణ కల్పించాలని బాలయ్య ప్రభుత్వాన్ని కోరారు.

## 16 ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నేరేడుచర్ల మండలం పుల్లంతండా గ్రామ పంచాయతీలో మంజూరైన 16 ఇళ్ల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ బానోతు మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుపోసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జి.లక్ష్మి , ఎంపివో నాగరాజు, తాళ్ల సురేష్‌రెడ్డి, వార్డు సభ్యులు బానోతు రంగమ్మ, బానోతు నాగరాజు, రామారావు, సైదమ్మ, రామావత్ కోటేశ్వరరావు, అంగోతు చిన్ని, ఉప సర్పంచ్ బానోతు మంగ పాల్గొన్నారు.

## శ్రీ మహా చండీ దేవిగా అమ్మవారి అలంకరణ

**ప్రజాపక్షం/త్రిపురారం:** రామాలయం యూత్ కమిటీ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం మహా చండీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అష్టోత్తర శతనామ కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.త్రిపురారం ఉప సర్పంచ్ అనుముల నాగమణి పాపిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాలలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అనుముల నాగమణి పాపిరెడ్డి, రామాలయం యూత్ కమిటీ సభ్యులు అనుముల నరేందర్ రెడ్డి,చల్ల నాగిరెడ్డి,యుగంధర్ రెడ్డి,రవీందర్ రెడ్డి, నిఖిల్ రెడ్డి, మల్లా రెడ్డి,సంతోష్,రాజీవ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## పత్తిలో అధిక దిగుబడులకు క్లోజర్ స్పేసింగ్ విధానం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించడంతో పాటు శాస్త్రీయ పద్ధతులను రైతులకు చేరువ చేయాలనే లక్ష్యంతో కపాస్ క్రాంతి మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ కార్యక్రమంలో భాగంగా లెంకలపల్లి గ్రామంలో పత్తిలో అధిక సాంద్రత,దగ్గరగా విత్తే పద్ధతి (క్లోజర్ స్పేసింగ్) సాగు విధానాలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్,వి.శ్రీధర్,ఎన్.నళిని, హిమబిందు,హెచ్.ఓ విద్యాసాగర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త అనిల్ మాట్లాడుతూ పత్తిలో సరైన విత్తన దూరాన్ని పాటించడం ద్వారా మొక్కల సంఖ్యను పెంచడంతో పాటు సమర్థవంతమైన యాజమాన్యం పాటించడం వల్ల పంట పెరుగుదల, కలుపు నియంత్రణ, ఎరువుల వినియోగం, పురుగు, తెగుళ్ల యాజమాన్యం వంటి అంశాలపై శాస్త్రీయంగా దృష్టి సారించవచ్చని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐతగోని పద్మ వెంకటయ్య,లెంకలపల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి కె.అరుణ,ఉపసర్పంచ్ శంకర్,వార్డు సభ్యులు శ్రీను,గణేష్,రైతులు రామలింగం, లింగారెడ్డి,శ్రీశైలం, అంజయ్య, లక్ష్మయ్య, సత్తయ్య,రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో విఫలం



**ప్రజాపక్షం/నాంపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమైందని మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.బుధవారం ఆయన మండలంలో పర్యటించి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.అనంతరం పెద్దాపురం పెద్ద చెరువు,నాగులమ్మ చెరువును, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాంపల్లి మండలంలో ఉన్న శేషిలేటి వాగు,గొలుసు కాలువలకు మరమ్మతులు చేయించి చెరువులను నీటితో నింపాలని డిమాండ్ చేశారు.మునుగోడు ఎమ్మెల్యేకు కాంట్రాక్టులపై,మంత్రి పదవిపై ఉన్న మోజు మునుగోడు ప్రాంత అభివృద్ధిపై లేదని ఎద్దేవా చేశారు. నాంపల్లి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు సరైన వైద్యం అందడం లేదని,డాక్టర్లు,నర్సుల కొరత ఉందని, తక్షణమే వైద్యులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం 2024/25 విద్యా సంవత్సరంలో గాంధీజీ హైస్కూల్ విద్యార్థిని కర్నాటి భువన పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచినందుకు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నరసింహారావు,జిల్లా నాయకులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,పూదరి సైదులు,నాంపల్లి సర్పంచ్ నక్క శేఖర్, జల్లెల సైదులు,సర్దార్ నాయక్ పాల్గొన్నారు.

## నవంబర్ 6 వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఖమ్మంనల్లగొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా నవంబర్ 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ శాసనసభ్యుడు కంచర్ల భూపాల్ రెడ్డి సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరుతూ బుధవారం పట్టణంలోని పలువురి గృహాలకు వెళ్లి వారి వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందని, మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే యువకులు, పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకుని బీఆర్ఎస్ కు అండగా నిలవాలని కోరారు.తెలంగాణ జాతిపిత కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడుతున్న ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా బాధ్యత తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. పీఆర్సీ, డీఏల విషయంలో, సీపీఎస్ రద్దు అంశంలో, 317, 46 జీవోల విషయంలో అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు దాటినా ఏ ఒక్క హామీని అమలు చేయని ప్రభుత్వంపై తిరగబడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాల్ రెడ్డి వెంట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి,బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసం శేఖర్,పేరిక యాదయ్య,దోటి శ్రీనివాస్,కాసం సంతోష్ కుమార్,రెల్లి సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** 1996వ సంవత్సరంలో రిక్రూట్మెంట్ ద్వారా నియామకమైన ఎల్ఐసి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. మోహన్ సింగ్, సెక్రటరీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద బుధవారం ఓపెన్ మార్కెట్ ఉద్యోగుల పాత పెన్షన్ సాధన కోసం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం 57 జిఓను కూడా అమలు చేయాలని కోరారు. 1996 సంవత్సరంలో నియామకమైన వారు ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందిన వారికి పాత పెన్షన్ విధానం లేక కేవలం రూ.1400 వేతనం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, మల్లికార్జున్, సారెడ్డి వెంకటరెడ్డి, ఎల్ఐసి అధికారులు, డెవలప్‌మెంట్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.






## ఎన్‌జి కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌ను అభినందించిన త్రిపుర గవర్నర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలాలో గత పది రోజులుగా నిర్వహించిన ఎన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో నాగార్జున ప్రభుత్వ కళాశాల (అటానమస్),నల్లగొండకు చెందిన తృతీయ సంవత్సరం ఎన్‌సీసీ క్యాడెట్ అయిత రాజు స్రవంతి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ తరఫున ఈ క్యాంప్‌లో పాల్గొన్న స్రవంతి తన ప్రతిభతో ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి ఆమెను అభినందించారు.క్యాడెట్ స్రవంతి సాధించిన ఈ విజయంపై నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఉపేందర్, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.ఆమెను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చిన స్రవంతి విజయం ఇతర ఎన్‌సీసీ క్యాడెట్లకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** హెచ్ఐవి,ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) డైరెక్టర్ జనరల్,కేంద్ర కుటుంబ, ఆరోగ్య, సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేష్ గుప్తా అన్నారు.బుధవారం ఆయన న్యూఢిల్లీ నుండి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలో ఎయిడ్స్ సంక్రమణ ఎక్కువగా ఉన్న జిల్లాల కలెక్టర్లతో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.హెచ్ఐవి వ్యాప్తిని తగ్గించడంతో పాటు, వైరస్ సోకిన వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలని,మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డైరెక్టర్ జనరల్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ తదితరులు హాజరయ్యారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారి 8వ వార్షికోత్సవం

**ప్రజాపక్షం/చండూరు:** దేవి నవరాత్రుల శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి 8వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా కొనసాగుతుంది. ఈ పవిత్ర వేడుకల్లో భాగంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ , బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ బుధవారం అంగడిపేటలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ తమ ఉద్యమ సహచరులైన పానుగంటి విజయ్ , బూడిద మల్లికార్జున్ లను ఘనంగ శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కనకదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులు ,భక్తులు పాల్గొన్నారు.



